# దుర్గావతి

పాశ్చాత్య ప్రముఖులచే ప్రశంసల నందిన
భారత వీరాంగన పవిత్ర చరిత్ర.

రచయిత

అలంపురం రాజు, బి. యే.

ప్రతాపశాలియగు నక్బరు ఢిల్లీ సింహాసనారూఢుడై యుండెను. మొగలు సామ్రాజ్యపు అర్ధచంద్రాంకితధ్వజము కాశ్మీరమునుండి కన్యాకుమారివరకును, సింధునదినుండి బంగాళాఖాతమువరకును ఎగురుచుండెను. పూర్వపు ఆఫ్ఘను రాజులు ఢిల్లీశ్వరునకు లొంగి బద్ధహస్తులై నిలచిరి. రాజపుత్రులందనేకులు మొగలుల దోర్దండప్రతాపమునకు గురియాటచే వారి దుర్గములు మొగలుల విహారస్థానములయ్యెను. కాని గఢామండలపు రాణి అక్బరునకు లొంగలేదు. చతురోపాయసంపన్నుడగు అక్బరు గఢామండలరాణి దుర్గావతిచే తన సార్వభౌమత్వము నంగీకరింపజేయుటకనేక యుపాయముల బన్నెను. తేజస్వినియగు దుర్గావతి వీరసాహసములచే నవి నిష్ఫలములయ్యెను.

దుర్గావతి మధ్యహిందూస్థానములోని మహోబ్బా సంస్థానపురాజు చందేలుని పుత్రి. ఆ యాస్థానపు నధిదేవతయగు దుర్గ నామ మా రాజపుత్రికిడిరి. తన పుత్రిక గుణసౌందర్యములం గాంచి యానందపడుచున్న చందేలుడు నామె నొక మహారాజునకిచ్చి వివాహ మొనర్చవలెనని యాశించుచుండెను. గఢామండలరాజగు దళపతి శహాని సాహసపరాక్రమములు విని ముగ్ధురాలై దుర్గావతి తన తండ్రికి తెలియకుండ నాతని తన మనమున వరించెను. దళపతి మహాయోధుడు, రాజకార్యధురంధరుడు. దుర్గావతి తనలేఖను దూతద్వారా దళపతి కెరిగించెను. దళపతి యాప్రేమపురస్కారము నత్యంతశ్రద్ధతో స్వీకరించెను. కాని యీ సంబంధము చందేలునికి నచ్చలేదు. దళపతి సామాన్య రాజపుత్రుడనియును, అతని రాజ్యము చిన్నదనియును, ఈ సంబంధముచే తన కులగౌరవము హెచ్చదనియును చందేలుని యభిప్రాయము. అందుచే నొక యుపాయము పన్ని యర్ధలక్ష సైన్యముతో స్వయంవరమునకు రావలసినదిగా దళపతికి కమ్మనంపెను. స్వయంవరమునకు వచ్చులోపుగా యర్ధలక్ష సైన్యమును దళపతి సమకూర్చలేడనియు, ఆకారణముచే స్వయంవరమందిరమును దళపతి ప్రవేశించుట సంభవింప నేరదనియు చందేలుడు నమ్మెను. వీరభూమి తురుష్కుల పాలైనను వీరత్వము భారతభూమియందు నశింపలేదనియు ప్రసిద్ధ వీరనాయకుడు రాజపుత్రుల నందరిని సమకూర్చినచో తురుష్కుల పారద్రోలుశక్తిసామర్థ్యములు హిందూపుంగవులందు గలవనియు చందేలుడు గుర్తించలేదు.

స్వయంవర మంటపమునందు దుర్గావతి సౌందర్యసాహసముల విని ముగ్ధులై వచ్చిన రాజపుత్రులుచితాసనములపై గూర్చుండియుండిరి. కాని రాజపుత్రమండలమునందు గఢామండలాధీశుడు లేడు. పుష్పమాలను చేతనిడికొని వచ్చిన దుర్గావతి ప్రతిమవలె నిలచియుండెను. దళపతి ముఖ మామెకు కనపడలేదు. తత్క్షణమే యామె యశ్రుబిందు వొకటి పూలమాలపైబడి, యొక్కనిమిషముండి, హిమబిందువుబోలి పూరేకునుండి జారి కర్కశభూమిపైబడి యారిపోయెను. సుముహూర్తము దాటిపోవనున్నదని చందేలుడు కుమార్తెను హెచ్చరించెను. కాని యామె ముకుళిత మనస్సునందీమాట ప్రవేశింపలేదు. ఆమె హృదయకమలము వికసింపజేయు బాలసూర్యుడింకను పూర్వశిఖరమున గోచరించలేదు. దళపతి సైన్యమును చేకూర్చి స్వయంవరమునకు వచ్చుటయందాలస్యమయ్యెను. దుర్గావతి యవస్థను చూచి యాహ్వానింపబడిన రాజపుత్రులు విస్మయమందిరి. కన్నియ మాట్లాడకయే మండపబహిర్ద్వారము చేరెను. అప్పుడే దళపతి గజమునుండి దిగి మండపము ప్రవేశింప తత్తరపాటుతో వచ్చుచుండెను. దూరమునుండి యెగిరివచ్చు పురుషకపోతమును విరహిణియగు స్త్రీకపోతము చూచి రెక్కలు విప్పి పరుగిడి కలసికొనునట్లు దళపతి స్వ

యంవరమంటపమందు కాలిడకనే దుర్గావతి త్వరితగతిని కుసుమమాల నాతని కంఠమునకువైచి యాతని వామభాగమున నిలచెను. భగ్నమనోరథుడై చందేలుడు దుర్గావతిని దళపతికి ఖడ్గధారాపూర్వకముగా నివ్వ సమకట్టెను. తక్షణమే స్వయంవర మంటపము సమరభూమి యయ్యెను. ఇరుపక్షములవారికిని ఘోరయుద్ధము జరిగెను. ఆయుద్ధమునందు చందేలుడు వీరస్వర్గమునందెను. విజయియగు దళపతి దుర్గావతిని తన నగరమునకు గొంపోయెను.

కాని దుర్గావతితో సహవాస సుఖము చిరకాల మనుభవించుటకు దళపతి నుదుటిపై విధాత వ్రాసియుండలేదు. దుర్గావతికి కుమారుడు పుట్టిన కొన్ని నెలలకే దళపతి కాలముచేసెను. గఢామండలమును స్వల్పకాల మంధకార మావహించెను. గఢామండలమునగల యీదుర్గతి చూచి అక్బరు సమయమునకై యెదురు చూచుచుండెను. కాని దుర్గావతి పతివియోగదుఃఖముచే వచ్చు కన్నీటి నరికట్టి రాజ్యభారమును వహించి సంస్థానాభివృద్ధికిని, బాలుని యభ్యుదయమునకును సమకట్టెను. తమకు తల్లివలె వర్తించుచున్న దుర్గావతి పాలనయందు ప్రజలు సంతుష్టచిత్తులై తమ యధిపతి యకాలమరణదుఃఖమును క్రమేణా మరువజొచ్చిరి.

అవిచ్ఛిన్నమైన సుఖము మనుష్యమాత్రునికి దుర్లభము. దుర్గావతి రాజ్యరక్షణసుఖ మనుభవించుటకు ప్రజలు నోచుకొనలేదు. ఆమె దేశోన్నతి సమాచారమును విని యసూయపడిన వారనేకులుగలరు. వారిలో అసోఫ్‌ఖానొకడు. అసోఫ్‌ఖాను గఢామండల సరిహద్దులలో మాళవదేశమునకు సుబేదారుగానుండెను. స్త్రీపాలిత సంస్థానము నాక్రమింప సమయమిదేయని యనేకసారులు రాజాధిరాజగు యక్బరునకు లేఖల నంపెను. అబలయగు దుర్గావతిని, బాలుడగు వీరనరేంద్రుని చంపి రాజ్యముచేపట్టుట కక్బరు మనస్సునకు రుచింపలేదు. గఢామండలమును రక్తపాతములేకుండ సామ్రాజ్యమున చేర్చుకొనవలెనని పలుతెరంగుల యోచించెను. విఫలుడై తుదకు అసోఫ్‌ఖానని పట్టుపలవిూద గఢామండలముపై దండెత్తుట కాజ్ఞయిచ్చెను.

అసోఫ్‌ఖాను తురుష్కసైన్యముల నసంఖ్యాకములుగ దెచ్చి పురద్వారమున నిలిపెను. నగరమున కోలాహలము హెచ్చెను. అప్పుడు సంస్థాన ముఖ్యాధికారులను పిలచి దుర్గావతి యిట్లనెను. 'మీరు బుద్ధిమంతులు. రణనైపుణ్యశీలురు. నేను స్త్రీనిగదా. మనకందరికి దుస్సహమగు యాపత్తు సంభవించినది. నిరపరాధులమగు మనలను చంపి, మన మతమును నిర్మూలించి, మనరాజ్యము నాక్రమింపజూచు ఈ మ్లేచ్ఛులనడత జూచితిరి గదా. ఈ ధర్మాంధులగు ముసల్మానులచే పీడింపబడుటకు మన పౌరుషము నశించినదా! నా ప్రజలారా! నాబంధుమిత్రులారా! మన మీ యుద్ధమున ఓడిపోయినచో మన నామరూపములుండవు. మతముండదు. మన స్త్రీలు వారి తొత్తులై యుండవలసి వచ్చును. క్షత్రియత్వము నశించును. ఇంతకన్న యధోగతి యుండునా? భారతభూమియందింకను పౌరుషమున్నచో నిప్పుడు చూపుడు. మీరు వీరశిరోమణులగు రాజపుత్రుల పేరు నిలుపగోరినచో ఈ అనాథగోవును రక్షింపుడు. గోహత్యకు వారు వెనుదీయరు. కాని యథార్థస్థితి వారు గ్రహించియుండలేదు. ఈ గోవే వారిపాలిట వ్యాఘ్రముగా పరిణమించునుగాక! దుర్గా! మాకు సహాయపడుము. శత్రువుల పారద్రోలుటకు మాహృదయములను శౌర్యముతో నింపుము!' దుర్గావతి యుత్తేజిత వాక్కులను విని రాజపుత్రులెల్లరు యుద్ధసన్నద్ధులైరి. ఎనిమిదివేల రౌతులును, పండ్రెండువేల సైనికులును స్వదేశరక్షణకై శత్రువుల నెదిరించిరి. దుర్గావతి సైన్యాధిపత్యము వహించెను. లోహకవచమును ధరించి శస్త్రధారిణియై దుర్గావతి యశ్వమునెక్కి సైన్యమును నడపినది. యుద్ధమారంభమయ్యెను. దుర్గావతి ప్రాణములపై ఆశవీడి శత్రుసైన్యముల భేదించివైచెను. ఆమె బల్లెపుపోటుచే యనేక తురుష్కసైనికులు హతులైరి. తిరిగి వచ్చునప్పుడు దుర్గావతి శత్రువ్యూహమునందు చిక్కుకొనెను. ఆమె భుజము తెగి రక్తము ప్రవహింప మొదలిడెను. ఆమెను రక్షింపబోయి రాజపుత్రులనేకులు సమరమున మడసిరి. తుదకు రక్తమయమగు దుర్గావతి శరీరమును రాజపుత్రులు శిబిరమునకు చేర్చిరి. అసోఫుఖాను దీని తెలిసికొని భ్రాంతచిత్తుడయ్యెను. ఆ భ్రాంతియే వాని పలాయనమునకు కారణమయ్యెను. రాజపుత్రుల ధాటి కాగలేక తురుష్కులు మాళవదేశమునకు పారిపోయిరి.

ఈ అపజయము నీచుడగు అసోఫుఖాన్ని క్రోధము నినుమడింపజేసినది. గఢామండలమును నాశనమొనర్పవలెనని పదునెనిమిది నెలలలో మహాసైన్యమును సేకరించుకొని తిరిగి దాడెత్తివచ్చెను. కాని యీసారియు రాజపుత్రుల ప్రతాపానలముచే తురుష్కసైన్యములు దహింపబడె

ను. అసోఫుఖానునకు 2-వసారి యపజయము సిద్ధించెను. యుద్ధభూమియందు దుర్గావతిని జయింపలేక అసోఫుఖాను కుతంత్రముల బన్న మొదలిడెను. తన గూఢచారులచే రాజపుత్ర సరదారులందు భేదములను కల్పించెను. రాణియందు ప్రజలకు ద్వేషభావముగలదని నీలివార్తల వ్యాపింపజేసెను. అప్పుడు మూడవసారి ఖాను మరల గఢామండలరాణి నెదుర్కొనెను. దుర్గావతి యిప్పుడు యదార్థమునకు అబలయైయుండెను. అయినను తన దేహమందు ప్రాణవాయువు ఉన్నంతవరకు తనరాజ్యము మొగలుల స్వాధీనము కానీయనని వీరరాజ్ఞి ప్రతిన బూనెను. యుద్ధము ఘోరరూపము దాల్చెను. దుర్గావతియు, పదునాలుగేండ్ల వీరేంద్రుడును యుద్ధభూమియందు శత్రువులదునుమాడుచుండిరి. యుద్ధముచేయుచు వీరేందుడు నేలకొరిగెను. మరి లేవలేదు. 'రాజ్ఞి! మరణఘాతనుతిన్న బాలుని తీసికొని శిబిరమునకు పోగూడదా? మాయంతటి వీరులుండగా యుద్ధరంగమున మీరుండవలెనా?' యని స్వామి భక్తుడగు రాజపుత్రు డొకడు దుర్గావతితో ననెను. దుర్గావతి గంభీరస్వరముతో 'నేను తిరిగి పోతినని తెలిసిన తక్షణమే మనసైన్యమును నిర్వీర్యతజెందును. వీరకుమారుడు క్షత్రియోచిత వీరస్వర్గమును పొందినచో నాకు చింతయేమి? యుద్ధము ముగియగనే నేనును నాపుత్రుని పరలోకమున కలసికొందు' ననెను.

దుర్గావతీ! నీవు ధన్యురాలవు. నీవు యుద్ధమందు చనిపోయినను గెలచిన రాణివే! శత్రుసేనాపరంపరలచే రాజపుత్ర సైన్య మంత మొందసాగెను. ఒకబాణము రాణికంటిని గ్రుచ్చివైచెను. మరొకబాణమామె హృదయమునందు తాకెను. బాణములు తీయుటతోడనే రక్తస్రావముచే యామె మూర్ఛనొందెను. ఆమె కూర్చునియున్న గజమును శిబిరమునకు మరల్ప రాఘు డొకడు ప్రయత్నించెను. తక్షణమే మూర్ఛనుండి దుర్గావతి లేచి 'నన్ను బ్రతికింప యత్నించుచున్నారా? నన్ను జీవముతో శిబిరమునకు గొంపోవలదు. ఎవరేని నా ప్రాణముల నీదేహము నుండి వేరుజేయు'డని యస్ఫుటస్వరముతో ననెను. కాని యావీరమాత కోర్కె నంగీకరించు వారెవరు? తక్షణమే దుర్గావతి తన కైజారును తీసికొని తన పొట్టయను యెరలో దూర్చివైచెను!

యుద్ధము సమాప్తమయ్యెను. రాజ్యము అసోఫుఖానుని వశమయ్యెను. క్షాత్రధర్మపరాయణియగు ఆవీర నారీశిరోమణి పవిత్రదేహము శత్రువులఅపవిత్రహస్తములచే మలినము కాలేదు. తక్షణమే యనుచరులు అగ్నికుండమును చేసి శాస్త్రోక్త విధిని సంస్కారములను చేసిరి.

దుర్గావతి యీనశ్వరశరీరమును విడచి అవినశ్వర కీర్తిని పొందెను. ఈ వీరాంగనను గురించి కర్నల్ స్లీమెన్ యను పాశ్చాత్య ప్రముఖు డీవిధముగ వ్రాసెను. 'రణశూర,రాణి యగు దుర్గావతి స్మారకచిహ్నము పర్వతప్రదేశమధ్యమున కట్టబడెను. అచట రెండు పాషాణ స్తంభములు జంటగా నిలచియున్నవి. ఆదృశ్యము ప్రేక్షకుల మనస్సునందు పూర్వ యుద్ధ చిత్రమును చిత్రితము చేయుచుండును. ఈగిరిశిఖరమున రాత్రివేళలందు రణఘోష వినవచ్చునని ప్రజలందురు. ప్రయాణీకు లీప్రదేశమందు సాగిపోవునపుడా వీరరాజ్ఞిని స్మరించుచు పరాక్రమపూరితహృదయు లయ్యెదరు. చుట్టుప్రక్కల దొరకు వివిధఫలములను ఏరుకొనిపోయి యాస్మారకచిహ్నమునకు సమర్పింతురు. మహారాణి దుర్గావతి దివ్యగుణముల నభినందించుచు ఫలమునొకదానిని నేనును అర్పించితిని.'

అసామాన్యశౌర్యము నెవరు పూజింపకుందురు?

గళ్ళచీర 100 పుటలు - అణాలు 8

తెనుగుకుటుంబాలలో నిహితమైవున్న మాధుర్యాన్ని
పరిస్ఫుటంచేసే ఆరుచిన్నకథల సంపుటి.

కథలశీర్షికలు:

1. గళ్ళచీర, 2. అమ్మమ్మ, 3. కాఫీ, 4. బాల్యస్నేహం, 5. అత్తాకోడళ్ళు, 6. పెళ్ళిచెడగొట్టిన అవధాని.

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఎ.

ఆంధ్రభూమి బుక్ డిపో—వేపేరి, మదరాసు.